

జమ్మికుంట మండలం గోవిందాపూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మానేరు వాగు



వీణవంక మండలం మల్లారెడ్డిపల్లిలో కూలిన ఇల్లు

అతలాకుతలం

- జనాలను ఉక్కిరిబిక్కిరి చేసిన వర్షాలు
- నిండిన జలవనరులు
- ఇంకా వర్షాలు కురిస్తే తెగిపోయే ప్రమాదం
- కూలిన ఆరు ఇళ్లు, రెండు రేకుల షెడ్లు
- చెరువులు, కుంటలు అలుగుపారడంతో రాకపోకలకు అంతరాయం
- నీట మునిగిన పంట పొలాలు...
- ఆందోళనలో రైతన్నలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అతలాకుతలమైంది. ఇంకా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి పూర్తి స్థాయికి చేరువలో నీరు వచ్చి చేరుతోంది. లోయర్ మానేరు రిజర్వాయర్, మిడ్ మానేరు రిజర్వాయర్లకు భారీగా నీరు వస్తోంది. జిల్లాలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. వర్షాకాలం సాగుకు అవసరమయ్యే నీరు సమకూరడం సంతోషాన్ని కలిగిస్తున్నా ఇంకా వర్షాలు కురిస్తే నష్టాలు చవిచూడాల్సి వస్తుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది. జిల్లాలో పలుచోట్ల చెరువులు, కుంటలు అలుగుపారడంతో రాకపోకలు అంతరాయం కలిగింది. వర్షాలకు చెట్లు, చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై విరిగిపడడంతో 31 విద్యుత్ స్తంభాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు పూర్తిగా, కొన్ని చోట్ల పిడుగుపాటు, వరద నీటితో ట్రాన్స్‌ఫార్మర్లు పాక్షికంగా దెబ్బతినడంతో ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పిడిసిఎల్)కు 18.65 లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. వందల ఎకరాల్లో పంట పొలాల్లోకి వరదనీరు చేరడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏమేరకు పంట పొలాలకు నష్టం జరిగింద నేది తెలియాల్సి ఉంది. వర్షాలకు రెండు రేకుల షెడ్లు, ఆరు ఇళ్లు దెబ్బతినడంతో తమకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.

- చెరువులు, కుంటలు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోయర్ మానేరు డ్యాం (ఎల్ఎండీ)కు భారీ వరద నీరు వచ్చి చేరుతోంది. జిల్లాలో అత్యధికంగా చిగురుమామిడి మండలంలో 83 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గంగాధరలో 82.4, చొప్పదండిలో 77.1, శంకరపట్నంలో 58.2, రామడుగులో 58.2, గన్నేరువరం మండలంలో 52.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అనేక చోట్ల కల్వర్టులు, రహదారులపై నుంచి భారీగా వరద నీరు ప్రవ హించడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం సాయంత్రం వరకు వర్షం తెరపి ఇవ్వడంతో వరద ఉధృతి తగ్గింది. అధికారులు రాకపోకలను పునరుద్ధరించారు. ఎక్కడ కూడా ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదు.

వర్షాలతో బల్దియా అప్రమత్తం



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 2: భారీ వర్షాల నేపథ్యంలో నగరపాలక సంస్థ అప్రమత్తమైంది. నగరపాలక సంస్థలో ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి 24 గంటలపాటు ఉద్యోగులు, డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కాల్‌సెంటర్‌కు ఫిర్యాదులు అందిన వెంటనే అక్కడికి డీఆర్ఎఫ్, ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులను పంపించి సమస్యలను పరిష్కరిస్తున్నారు. రెండు, మూడు రోజులపాటు భారీ వర్షసూచన ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ సోమవారం ఉదయం పలు డివిజన్లలో పర్యటించి, శానిటేషన్, ఇంజనీరింగ్ పనులను తనిఖీ చేశారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే కాల్‌సెంటర్ 98499-06694, 0878-2237700 నంబర్లకు ఫోన్ చేసి సమాచారమివ్వాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగలేదని, కాల్‌సెంటర్‌కు 30కిపైగా ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వాటిని డీఆర్ఎఫ్ సిబ్బంది పరిష్కరించారని చెప్పారు. వర్షపు నీరు నిలువకుండా చూడడంతోపాటు దోమల నివారణ చర్యల్లో భాగంగా ఫాగింగ్, గంబోజియా చేపలు వేయడం వంటి చర్యలు చేపడతామన్నారు. సోమవారం నగరంలోని 5, 27 డివిజన్లలో పర్యటించి డోర్ టు డోర్ చెత్తసేకరణను పరిశీలించానని చెప్పారు. ఎల్ఎండీలో నీటి నిల్వ పెరుగుతోందని, త్వరలోనే గతంలో మాదిరిగా ప్రతిరోజు మంచినీటిని అందిస్తామన్నారు. నీటిని శుద్ధి చేయిస్తామని, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రజలు కాచి చల్లార్చిన గోరువెచ్చని నీటిని తాగాలని సూచించారు. ఆమె వెంట అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ స్వామి ఉన్నారు.

విద్యుత్‌శాఖకు రూ. 18.65 లక్షల నష్టం

- సమస్యల పరిష్కారానికి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

గణేశ్‌నగర్: రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు విద్యుత్ శాఖకు 18.63 లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. 31 విద్యుత్ స్తంభాలు, మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పడిపోయాయన్నారు. నియోగదారుల కోసం హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 9440811444, 1912, 18004250028 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు. కరీంనగర్ సర్కిల్‌కు రాజు చౌహాన్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించారని, ఆయన ఆధ్వర్యంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగంగా చేస్తున్నామని తెలిపారు. భారీ వర్షాలు కురిసినా, రాత్రి పగలు తేడా లేకుండా విద్యుత్ అంతరాయం ఎక్కడ ఏర్పడినా.. అక్కడికి వెళ్లి తమ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యుత్ స్తంభాలు, ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డు లను తడి చేతులతో ముట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో డి ఈ చంద్రమౌళి, ఏడీలు అంజయ్య, ప్రదీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



కొట్టుకుపోతున్న ట్రాన్స్‌ఫర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ,అధికారులు

ఇళ్లలోకి చేరిన వరద నీరు

భగత్‌నగర్: కొత్తపల్లి మండల వ్యాప్తం గా వర్షంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మండలంలో 46.5 మిల్లీమీటర్ల వర్షపా తం నమోదయింది. లక్ష్మీపూర్‌లోని ఓ రెసిడెన్సీలో వరద నీరు చేరడంతో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అక్కడికి వచ్చి సమస్యను పరిష్కరించారు. మల్కాపూర్, లక్ష్మీపూర్‌లో పలు గ్రాం తాల్లో వరద నీరు చేరడంతో తహసీ ల్దార్ రాజేష్, ఎంపీడీవో ప్రభు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరించారు. బావుపేట, చింతకుంట, కమాన్‌పూర్ గ్రా మాల్లో రోడ్డుపై నలిచిన నీటిని ఎక్స్‌కవేటర్ సాయంతో మళ్లించారు. చింతకుంట బాలి కల గురుకుల పాఠశాల, కళాశాలలో వరద నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎక్స్‌కవేటర్ సహాయంతో నీటిని మళ్లించారు.

నీట మునిగిన కాలనీలు

కరీంనగర్ రూరల్: మండలంలోని తీగలగుట్టపల్లి విద్యారణ్యపురి, సరస్వతీ నగర్ కాలనీల్లో వరద నీరు చేరింది. ఆర్వోబీ వద్ద నీరు నిలవ డంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నగునూర్ సమీపంలోని కల్వర్టు పైనుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నగునూర్ చెక్ డ్యామ్ సమీపంలో వరద ఉధృతికి కోతకు గురై పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫర్మర్ వాగులో కొట్టుకు పోయింది. చెర్లబూత్కూర్ గుజ్జులపల్లి మధ్యలో ఉన్న కల్వర్టుపై నీరు ప్రవాహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దుర్శేడ్, గోపాల్ పూర్, చేగుర్తి గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ఇళ్లలోకి నీరు చేరింది. పంచాయతీ సిబ్బంది వరద నాటిని తొలగించారు. దుర్శేడ్ వద్ద రాజీవ్ రహదారిపై వరద నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బ ందిపడ్డారు. బొమ్మకల్ మల్లయ్య వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చామనపల్లి-బహదూర్ ఖాన్ గ్రామాల మధ్య ఉన్న లోలెవెల్ కల్వర్టు నీట మునిగింది.

కొనసాగుతున్న పంది వాగు ప్రవాహం

చొప్పదండి: మండలంలోని పంది వాగు రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆర్నకొండ నుంచి రాగంపేట, గోపాలరావుపేటకు వెళ్లే రోడ్డుపై నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోవడంతో మండలంలోని ఆర్నకొండ, రాగంపేట, రేవెల్లి, పెద్దకుర్మపల్లితో పాటు రామడుగు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చొప్పదండి నుంచి గోపాల్‌రావుపేట, పెగడపల్లివైపు రాకపోకలు నిలిచిపోయాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

ఇల్లందకుంట: మండలంలోని చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండాయి. మండలంలోని మల్యాల, పాతర్లపల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నాగంపేట-రాచపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీరు ప్రవహించడంతో కల్వర్టు దెబ్బతిన్నది.

తెగిన కల్వర్టు



కోతకు గురైన కొండన్నపల్లి కల్వర్టు

గంగాధర: మండలంలోని పలు రోడ్లు కోతకు గురయ్యాయి. గట్టుబూత్కూర్, ర్యాలపల్లి, నారాయణపూర్ రిజర్వాయర్, సర్వారెడ్డిపల్లి చెరువులు మత్తడి పోస్తున్నాయి. గట్టుబూత్కూర్ చెరువు నుంచి వరద నీరు వస్తుండడంతో హిమ్మత్‌నగర్, గట్టుబూత్కూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి వస్తున్న వరదతో నాగిరెడ్డిపూర్ కల్వర్టు తెగిపోయింది. దీంతో ఆ గ్రామ ప్రజలకు లక్ష్మీదేవిపల్లి మీదుగా వస్తున్నారు. వర్షాలకు మండలంలోని కొండయ్యపల్లిలో మియ్యాపురం లక్ష్మీనారాయణ, గౌడ లచ్చయ్య ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. లక్ష్మీదేవిపల్లిలో విద్యుత్ స్తంభం విరిగిపడింది. సర్వారెడ్డిపల్లి చెరువు కట్ట కోతకు గురవడంతో అధికారులు పరిశీలించారు.

లోలెవల్ వంతెనలపై వరద నీరు



పర్లపల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

తిమ్మాపూర్: మండలంలోని పలు రోడ్లపై వరద నీరు ప్రవహించింది. కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం వర్షం తగ్గడంతో గ్రామాల నుంచి బయటికి వచ్చి తమ పనులు చేసుకున్నారు. మన్నెంపల్లిలో ఐదు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మన్నెంపల్లి- ఇందిరానగర్, తిమ్మాపూర్-పొరండ్ల గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెనలపై వరద నీరు ప్రవహిస్తోంది. పర్లపల్లి కొత్తకుంట చెరువు నుంచి వస్తున్న వరద నీటితో ఎస్సీ కాలనీలోకి రాకపోకలు నిలిచిపోయాయి. పొలంపల్లి-మొగిళిపాలెం గ్రామాల మధ్య ఉన్న వంతెన వర్షాలకు దెబ్బతిన్నది.

షానగర్ ఎల్లమ్మ చెరువుకు గండి



గండి పడ్డ షానగర్ ఎల్లమ్మ చెరువు

రామడుగు: మండలంలోని షానగర్ ఎల్లమ్మ చెరువుకు గండి పడింది. దీంతో రైతులు, మత్స్యకారులు చెందుతున్నారు. ఈ చెరువులో చేపల పెంపకానికి మత్స్యకారుడు మామిడి నరసయ్య దాదాపు ఆరు లక్షల రూపాయల పెట్టుబడి పెట్టాడు. చేపలు పెరిగి చేతికొచ్చే సమయంలో చెరువుకు గండి పడింది. దీంతో చేపలనీ కొట్టుకుపోయాయని నరసయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



జమ్మికుంట హౌసింగ్‌బోర్డు కాలనీలో షాపులోకి వచ్చిన నీరు

జమ్మికుంట/ జమ్మికుంట రూరల్: పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. హౌసింగ్‌బోర్డు, దుర్గాకాలనీ, హరితనగర్, కృష్ణాకాలనీ, వడ్డెర కాలనిలోకి చేరిన వరద నీరు తగ్గుముఖం పట్టింది. హౌసింగ్‌బోర్డు కాలనీపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. మడిపల్లి, మాచనపల్లి గ్రామాల్లో రెండు రేకుల షెడ్లు కూలిపోయాయి.

రాక పోకలకు అంతరాయం



మామిడాలపల్లిలో వరదకు తెగిపోయిన కరీంనగర్ రోడ్డు

వీణవంక: మండలంలోని మాల్లారెడ్డిపల్లికి చెందిన నిమ్మల రాజయ్య ఇల్లు కూలింది. బేతిగల్, కనపర్తి వీణవంక చెరువులు మత్తడి దుకుతుండడంతో పంటలు నీట మునిగాయి. వీణవంక జమ్మికుంట రహదారిపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిపివేసి దారి మళ్లించారు. వీణవంక వాగు ఉధృతంగా ప్రవహించడంతో రామకృష్ణాపూర్ చెక్‌డ్యాం వద్ద కరకట్ట కోతకు గురైంది. మామిడాలపల్లి సమీపంలో కరీంనగర్‌కు వెళ్లే రోడ్డు కోతకు గురవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు 120 ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీట మునిగాయి. మానేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

లో లెవల్ వంతెనపై గుంతలు



గుంతలమయంగా మారిన సైదాపూర్ లోలెవల్ వంతెన

సైదాపూర్: రెండు రోజులుగా కురిసిన వర్షానికి హుజూరాబాద్- హుస్నాబాద్ ప్రధాన రహదారి దెబ్బతిన్నది. సైదాపూర్ సమీపంలోని లోలెవల్ వంతెన మధ్యలో భారీ గుంత ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. వెన్కేపల్లి గ్రామంలో కరంగంటి రాజమ్మ ఇల్లు వర్షానికి పాక్షికంగా దెబ్బతిన్నది.



చెర్లబూత్కూర్ గుజ్జుల పల్లి కల్వర్టు పై నుంచి ప్రవహిస్తున్న నీరు



వరదకు దెబ్బతిన్న నాగంపేట-రాచపల్లి కల్వర్టు



నగునూర్ గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టు పై నుంచి భారీగా ప్రవహిస్తున్న నీరు

'పోషణ మాసాన్ని విజయవంతం చేయాలి'

కరీంనగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30 వరకు జిల్లాలో నిర్వహించనున్న పోషణ మాసం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా అధికారులతో సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని అన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు తీసుకోవలసిన పోషకాహారం గురించి వివరించే ప్రదర్శనలు, సమావేశాలు, ర్యాలీలు, మేళా వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు గ్రామైక్య సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పోషణ్ మాసంలో పాల్గొన్నాలన్నారు. అన్నప్రాసన, సీమంతం, వంటల పోటీలు, ఆటలు, కథ నాటకం, బేబీ షో వంటి కార్యక్రమాల ద్వారా పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలో నిర్వహిస్తున్న శుక్రవారం సభలోను పోషన్ మహా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. శుక్రవారం సభ నిర్వహణకు గ్రామాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించాలని ఎంపీడీవోలకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి, డీఎంహెచ్‌వో సుజాత, మెప్మా పీడీ స్వరూపారాణి, అడిషనల్ డీఆర్డీవో సునీత, డీటీడీవో జనార్దన్, డీపీవో రవీందర్ పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీసీ సంఘం నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 2: బీసీల కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీల కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడం లేదని విమర్శించారు.బీసీల న్యాయమైన డిమాండ్లను అమలు చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీఎస్ ఆనంద్, రాచమల్ల రాజు, నారోజు రాకేశ్‌చారి, మాదాసు సంజీవ్, ఎడ్ల సురేందర్, నలవెలి రవీందర్, వంగల రావిగోపాల్, బండారు మల్లయ్య, కాసరాజు, ఆకుల సురేష్, బియ్యాన్ని తిరుపతి, తాళ్లపల్లి మహేశ్, పోకల విజయ్, కుసుంభ ఆదర్శ్, సుదగోని గణేశ్ పాల్గొన్నారు.

రూ.53 లక్షలకు ఇసుక వేలం

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 2: జమ్మికుంట మండలం శంభునపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పరిమల కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన 1500 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను అదే గ్రామానికి చెందిన ఎస్ రమేష్ అనే వ్యక్తి బహిరంగ వేలం ద్వారా రూ.53లక్షలకు సోమవారం దక్కించుకున్నాడు. వేలంలో రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమలకు సబ్సిడీ రుణాలు అందజేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్

భగత్‌నగర్, సెప్టెంబరు 2: ప్రభుత్వం గొల్ల, కురుమలకు 75 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్‌యాదవ్ అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గొర్రెకాపరుల సహకార సంఘ సొసైటీ ఎన్నికల్లో ఉత్సాహంగా పనిచేయలన్నారు. స్వర్గీయ కాలువ నర్సన్న యాదవ్ ఆశయ సాధన కోసం పనిచేయాలన్నారు. ప్రమాదవశాత్తు పిడుగుపాటు, పాముకాటుతో చనిపోయిన వారికి పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. గొర్రెల కాపరులకు ఫారెస్ట్ అధికారుల వేధింపులు అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్నయాదవ్, రాష్ట్ర కార్యదర్శి కదారి ఐలయ్య, చిగుర్లశ్రీనివాస్, నందనవేని ప్రసాద్, జంగం కొమురన్న, గూడెం శ్రీనివాస్ రాజు, దాడి రాజబాబు, గంగంలింగయ్య, రాధారపు కుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 2: భారీ వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా అనేక గ్రామాలకు రాకపోకలు స్తంభించి పోయాయన్నారు. చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమై కాలనీలు నీట మునిగాయన్నారు. ఇసుక మేటలతో పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు.ఇళ్లు కూలిపోయిన వారిని వెంటనే ఆదుకోవాలన్నారు. కరీంనగర్‌లో హైడ్రా తరహాలో సంస్థను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు నరేష్‌పటేల్, నాయకులు పున్నం రవి, చెలకాని శ్రీనివాస్, ఎంప్రశాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి



విజేతగా నిలిచిన రామగుండం ఎన్టీపీసీ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అధికారులు

బ్యాడ్మింటన్ విజేత
రామగుండం ఎన్టీపీసీ జట్టు

జ్యోతినగర్, సెప్టెంబరు 2 : కర్నాటకలోని కుడిగి ఎన్టీపీసీలో జరిగిన ఇంటర్ రీజినల్ స్పోర్ట్స్ మీట్ 2024లో రామగుండం ప్రాజెక్టు జట్టు బ్యాడ్మింటన్‌లో విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో రామగుండం ఎన్టీపీసీ ఆటగాళ్లు సింగిల్స్, డబుల్స్‌లో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచారు. హరీష్‌కుమార్ నాయకత్వంలోని రామగుండం ఎన్టీపీసీ జట్టు సభ్యులు రాంబాబు, రాజేశ్, శోభన్‌బాబు, సోహన్ సింగ్, వీరబాబు, టీం మేనేజర్ జి.భానేశ్వర్, కోఆర్డినేటర్ లను ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాడు అభినందించారు.

తెరుచుకున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	2,51,250	3,30,781	80.5	73.00
ఎల్లంపల్లి	2,78,326	4,02,023	20.175	14.181
మిడ్ మానేరు	46,272	6.400	27.54	19.55
ఎల్ఎండీ	9.718	273	24.034	15.788
ఎగువమానేరు	27,500	-------	2.00	2.00

- 40 గేట్లు ఎత్తి దిగువకు 2 లక్షల క్యూసెక్కుల నీరు
- వరద కాలువకు 7 వేల క్యూసెక్కులు
- ప్రాజెక్టులోకి 2.51 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం భారీగా వరద రావడంతో 40 గేట్లు ఎత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇన్‌ఫ్లో భారీగా కొనసాగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన గేట్లను విడతల వారీగా ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వరద కాలువకు సైతం 7 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రాజెక్టులోకి 2,51,250 క్యూసెక్కుల ఇన్‌స్టంట్ ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 73 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుం చి 40 గేట్లు ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతుండగా, కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కులు, వరద కాలువకు 5 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదిలారు.

ఉదయం 6 గంటలకు వరద కాలువకు 1,500 క్యూసెక్కులు విడుదల చేయగా, 7 గంటలకు ఇన్‌ఫ్లో ఎప్పటికప్పుడు పెరుగుతుండడంతో 3 వేల క్యూసెక్కులు, 10 గంటల నుంచి 5 వేల క్యూసెక్కులకు, సాయంత్రం 4 గంటలకు 7వేల క్యూసెక్కులకు పెంచారు. గోదావరి తీర ప్రాంత ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎస్సారెస్పీ, రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ధర్మపురి, కోటిలింగాల వద్ద ఉధృతంగా గోదావరి

ధర్మపురి: ధర్మపురి వద్ద గోదావరి నది వరద సోమవారం సాయంత్రం ఉధృతంగా ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురి సిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి పోయాయి. కడెం ప్రాజెక్టు గేట్లు తెరచి గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం క్షణ క్షణం పెరిగి వేగంగా ప్రవాహం కొనసాగింది. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల సంతోషిమాత, మంగళిగడ్డ, సోమవిహార్ స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది మైకుల ద్వారా ప్రచారం చేసి అప్రమత్తం చేశారు. అలాగే నదీ తీరాన గల పలు గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి



ఎస్సారెస్పీ వద్ద గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

● వెల్గటూర్: కోటిలింగాల వద్ద సోమవారం వరద ఉధృతి పెరిగింది. స్నాన ఘట్టాలపైకి నీరు చేరింది. తహసీల్దార్ శేఖర్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమా సాగర్‌లు ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. కోటిలింగాల, చెగ్యాం వద్ద గోదావరి పరివాహక ప్రాంతాలలో పర్యటించి, ప్రజలు గోదావరిలోకి వెళ్ల వద్దని హెచ్చరించారు. చేపలు పట్టే వారు చేపల వేటకు వెళ్లవద్దని, పశువుల కాపర్లు గోదావరిలోకి వెళ్లవద్దని హెచ్చరించారు.

ఎల్లంపల్లి నుంచి భారీగా నీటి విడుదల

అంతర్గాం : అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామ శివారులో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 32గేట్లు ఎత్తి సోమవారం గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నట్టు ఎల్లంపల్లి అధికారులు తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టులోకి ఎగువన గల కడెం ప్రాజెక్టు నుంచి 40,250 క్యూసెక్కులు, వాగులు, కుంట ల ద్వారా మొత్తం 2,78,326 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఎల్లంపల్లి అధికారులు 32 గేట్లను ఎత్తి 4,02,023క్యూసెక్కుల నీటిని దిగువన గల గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175టీఎంసీలకు ప్రస్తుతం ప్రాజెక్టులోకి 14.181 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి ఇంకా వరద ఉధృతి కొనసాగుతుండగా అధికా రులు



ఎల్ఎండీ ప్రాజెక్టులో నీరు

మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉన్నది. గేట్లు ఎత్తడంతో గోదావరి తీర ప్రాంతగ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

గాయత్రీ పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల నిలిపివేత

● ప్రారంభం నుంచి 205 టీఎంసీల నీరు ఎత్తిపోత

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదలను కొనసాగించిన అధికారులు సోమవారం నిలిపివేశారు. నెలరోజులుగా ఇక్కడి నుంచి మిడ్ మానేరుకు 24.2 టీఎంసీల నీటిని రిజర్వ్ చేశారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తుండటంతో పాటు అన్ని జలాశయాలలో నీరు ఉండటంతో నీటి విడుదలను ఆపివేసినట్లు అధికారులు చెబుతున్నారు. గాయత్రీ పంప్‌హౌస్ ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు 205 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఒక్కో టీఎంసీతో పది వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుండగా మొత్తం 20లక్షల50 వేల ఎకరాలకు సాగు నీరు అందించినట్లు అయింది.

మిడ్ మానేరుకు భారీగా వరద

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షాలతో మానేరు, మూల వాగు ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టులో నీటి నిల్వ గణనీయంగా పెరుగుతోంది. ప్రాజెక్టులోకి 46,272 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇందులో మానేరు, మూలవాగు, వరద కాలువ క్యాచ్‌మెంట్ల ద్వారా 41,271 ఎస్సారెస్పీ నుంచి 5 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. గాయత్రీ పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతలను నిలిపివేశారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు ఎగువ భాగాన కురిసిన భారీ వర్షాలకు ఆదివారం సాయంత్రం వరకు 15.30 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉండగా సోమవారం 19.55 టిఎంసిలకు చేరుకుంది.

పెరుగుతున్న ఎల్ఎండి నీటి మట్టం

తిమ్మాపూర్: రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం ఉధృతంగా ప్రవహించిన మోయతుమ్మెద వాగు సోమవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో ఉధృతి కూడా తగ్గింది. ఎల్ఎండిలో ప్రస్తుతానికి 24.034 టీఎంసీలకు 15.754టిఎంసిల నీరు నిల్వ ఉండగా, మోయతుమ్మెద వాగు ద్వారా 7,887క్యూసెక్కులు, ఎగువ ఎల్ఎండి నుండి 1,831క్యూసెక్కులు మొత్తం 9,718 క్యూసెక్కుల నీరు ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లోలు వస్తుండగా 273క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో ఇరిగేషన్ అధికారులు ఎల్ఎండీ వద్ద ఉండి పర్యవేక్షిస్తున్నారు.

ఉప్పొంగుతున్న మానేరు

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు పరవళ్లుతొక్కుతూ పోటెత్తుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సిద్దిపేట జిల్లాలోని కూడవెల్లి వాగు, కామారెడ్డి జిల్లాలోని పాల్వంచ వాగు పోటెత్తి ఉధృతంగా ప్రవహిస్తుంటంతో మానేరులోకి వరద నీరు భారీగా వస్తోంది. దీంతో అధికారులు మానేరు వాగు పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. రైతులు, మత్స్యకారులు అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుం టున్నారు.

వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

కోరుట్ల, సెప్టెంబరు 2 : కోరుట్ల పట్టణానికి చెందిన రియల్టర్‌ను బెదిరించి డబ్బుల వసూళ్లకు పాల్పడ్డ అయిలాపూర్ గ్రామానికి చెందిన సుందరగిరి లక్ష్మీనర్సయ్యగా అనే వ్యక్తిని కోరుట్ల పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ సురేష్ బాబు తెలిపారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అరెస్టు వివరాలను ఎస్ఐ శ్రీకాంత్‌తో కలిసి వెల్లడించాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ఉంటున్న దాసరి రాజశేఖర్ అలియాస్ టీవీ శేఖర్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి లక్ష్మీనర్సయ్య ఫోన్ చేసి మొదట కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. కొద్ది రోజులకు ప్రకాశం రోడ్డులోని రాజశేఖర్ టీవీ సర్వీసింగ్ సెంటర్‌కు వచ్చిన సదరు వ్యక్తి రూ. 10లక్షలు ఇవ్వాలని లేకుంటే చంపుతానని బెదిరించాడు. దీంతో వెంటనే రాజశేఖర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో ఆ ప్రాంతంలో నిఘా ఉంచాడు. ఆదివారం సాయంత్రం మరో మారు రాజశేఖర్ వద్దకు సదరు వ్యక్తి వచ్చిన విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో అక్కడి చేరుకుని మాటు వేసి పట్టుకున్నారు. ఆ వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. అతని వద్ద సెల్ ఫోన్, ద్విచక్ర వాహనం, కత్తి స్వాధీనం చేసుకున్నారు. రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ శ్రీకాంత్, కానిస్టేబుళ్లు ఎల్లయ్య, పురిషోత్తం, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.

గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 2: పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కూనారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో చేపలు బయటకు వెళ్లకుండా వలలు కట్టడానికి వెళ్లి గోస్కుల కుమార్(45) ఆదివారం గల్లంతయ్యాడు. గాలింపు చర్యలో సోమవారం మృతదేహం లభ్యమైంది. మృతిచెందిన కుమార్ కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగల్ గ్రామ వాసి. చెరువులో నుంచి చాపలు బయటికి వెళ్లకుండా ముత్తడి వద్ద వలలు కట్టడానికి గోస్కుల కుమార్, కలవేన మొగిలి, సాగర్ల తిరుపతి, చేతి నరసయ్య వెళ్లగా వరద ప్రవాహానికి గోస్కుల కుమార్ గల్లంతయ్యాడు. పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులను మత్స్య కార్మికులను రెస్క్యూ టీం సభ్యులను అప్రమత్తం చేశారు. ఉదయం నుంచే చెరువులో గాలింపు చేపట్టగా కుమార్ మృతదేహం లభ్యమైంది. కుమార్ మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. బతుకుదెరువు కోసం వచ్చి ప్రాణాలు కోల్పోవడంతో అటు మృతుడి గ్రామం ఇటు కునారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఏసీపీ వెంట సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ వెంకటేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో రామ్మోహన్‌చారి, ఎంపీవో గోవర్దన్, పోలీసులు అధికారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ ట్రాన్స్‌కో ఫోర్‌మన్ మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 2: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ట్రాన్స్‌కో ఫోర్‌మన్ అజ్మీర సారయ్య(53) సోమవారం మృతి చెందాడని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. కరీంనగర్ భాగ్యనగర్‌లో నివాసం ఉంటున్న అజ్మీర సారయ్య కరీంనగర్ టౌన్-5 టవర్‌సర్కిల్ ప్రాంతంలో ఫోర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆగస్టు 30న రాత్రి విధులు ముగించుకుని ఇంటికి బైక్‌పై వెళుతుండగా భాగ్యనగర్ అప్నాబజార్ కిరాణంషాపు చౌరస్తా వద్ద గణేష్ మండపం ఏర్పాటు కోసం రోడ్డుపై నిర్లక్ష్యంగా వదిలిన భారీ ఇనుప బల్లలను బైక్ ఢీకొట్టింది. దీంతో కిందపడిన అజ్మీర్ సారయ్య కాలు, ముఖం, నడుం భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తుండగా సోమవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా భారీ ఇనుప బల్లలను రోడ్డుపై వదలిన కారణంగా తన తండ్రి ప్రమాదానికి గురై మరణించాడని, వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి కొడుకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బోవెరాను ఆదర్శంగా తీసుకోవాలి

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 2: ప్రతి ఒక్కరూ డాక్టర్ బోయినపల్లి వెంకటరామారావు(బోవెరా)ను ఆదర్శంగా తీసుకోవాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. బోవెరాలా పనిచేసే 360 డిగ్రీల యువ నాయకత్వం సమాజానికి కావాలని ఆయన అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపం హాల్-2లో బోవెరా సంస్థల ఆధ్వర్యంలో బోవెరా 104వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బోవెరా విగ్రహానికి పూల మాలలు వేశారు. బోవెరా సంస్థల అధ్యక్షుడు బోయినపల్లి హనుమంతరావు స్వాగతోపన్యాసం చేశారు. గద్దర్‌కు మరణానంతరం గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ దంపతులకు గాయకుడు, కవి అందెశ్రీతో పాటు ఇతర అతిథుల చేతుల మీదుగా బోవెరా కవితా పురస్కారాన్ని అందజేశారు. ఈసందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బోవెరా మద్యనిషేధం, గ్రంథాలయోద్యమం, అంటరానితనం నిర్మూలన, వయోజన విద్య, హిందీ భాషా ప్రచారం, భూదాన ఉద్యమాల ద్వారా ప్రజల్ని ప్రభావితం చేశారని అన్నారు. బోవెరా పేరుతో ఆయన స్వగ్రామం తోటపెల్లిలో ఒక కళాక్షేత్రం, స్మారక ఆశ్రమం ఏర్పాటు చేయాలనుకోవడం హనుమంతరావు గొప్పతనానికి నిదర్శనమని అన్నారు.

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ సమాజం కోసం జీవితాన్నే



గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ దంపతులకు బోవెరా పురస్కారంతో సన్మానం

త్యాగం చేసిన బోవెరా మన గడ్డపై పుట్టడం గర్వకారణమని అన్నారు. అందెశ్రీ మాట్లాడుతూ బోవెరా విగ్రహం ఏర్పాటు చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ తాను ఎంచుకున్న జీవన విధానంలో బోవేరా కృతకృత్యులయ్యారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు పృథ్వీరాజ్ వ్యాఖ్యాత మాడిశెట్టి గోపాల్, పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, నగర వాసులు, బోవేరా అభిమానులు, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మహిళ మృతి



లక్ష్మి (ఫైల్)

వీర్నపల్లి, సెప్టెంబరు 2 : వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండా గ్రామ పరిధిలోని లొద్ది తండాలో సోమవారం పాడి గేదె నెట్టడంతో గిరిజన మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మాలోతు లక్ష్మి (52) పాడి గేదెను తాడుతో పట్టుకొని మేత మేపేందుకు వెళ్తోంది. వెనక నుంచి గేదె నెట్టడంతో ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో పట్టుకున్న తాడు ఆమెకు చుట్టుకొని కింద పడింది. తలకు, మెడ నరాలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త రాజ్యా, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 2: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం కారు, ఆటో ఢీకొన్న ఘటనలో నారాయణపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సయ్య తన ఆటోను నడుపుకుంటూ బస్టాండు వైపునకు వెళ్తున్నాడు. గొల్లపల్లి నుంచి సిరిసిల్ల వైపునకు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో నర్సయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాటిపల్లి బాలికల గురుకులం ఖాళీ

- మూడు రోజుల పాటు విద్యార్థులకు సెలవు
- శిథిల భవనాలు.. భారీ వర్షాలే కారణం

మల్యాల, సెప్టెంబరు 2: మల్యాల మండలం తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులను ఇంటికి పంపించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఇక్కడి విద్యార్థులకు సోమవారం నుంచి మూడు రోజుల పాటు సెలవు ప్రకటించారు. దాదాపు నలభై ఏళ్ల క్రితం ఎస్సారెస్పీ కెనాల్ తవ్వకం సందర్భంగా ఏర్పాటు చేసిన సిబ్బంది క్వార్టర్స్‌లో గురుకుల పాఠశాల ఏర్పాటు చేయగా అప్పటి నుంచి సగంకు పైగా ఆ భవనాలనే కొనసాగిస్తుండడం, మరి కొన్ని భవనాలు శిథిలవస్థకు చేరి కూలే దశకు చేరుకోవడంతో వర్షాలతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా విద్యార్థులను ఇంటికి పంపించారు. ప్రస్తుతం పాఠశాలలో 475, కళాశాలలో 171 మంది విద్యనభ్యసిస్తున్నారు. 2018లో కళాశాల ఏర్పాటు చేసినప్పటికీ భవనాలు నిర్మించకపోవడం, పాత, శిథిల భవనాలలో తరగతులు నిర్వహించడం, చిల్లులు పడిన రేకుల గదులలోనే విద్యార్థులు పడుకోవడం తదితర అనేక సమస్యలను విద్యార్థులు ఎదుర్కొంటు న్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉండడంతో



తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల

ఆది, సోమవారాల్లో విద్యార్థులను ఇంటికి పంపించారు. ఈ విష యమై పాఠశాల, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మానసను వివరణ కోరగా శిథిల, పాత భవనాలు సమస్యాత్మకంగా ఉన్న చోట్ల విద్యార్థులను ఇంటికి పంపించాలనే గురుకులాల సొసైటీ అధికారుల సూచన మేరకు విద్యార్థులకు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించి ఇంటికి పంపించినట్లు తెలిపారు

ఏఐఎస్ఎఫ్ న్యాయ విద్య విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా బాలసాని లెనిన్

పెద్దపల్లి రూరల్ , సెప్టెంబరు 2: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బాలసాని లెనిన్‌ను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర న్యాయ విద్య విభాగం కన్వీనర్‌గా నియామకం అయ్యారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణలో న్యాయ విద్య విద్యార్థుల కోసం ప్రత్యేకంగా లా వింగ్ ఏర్పాటు చేశామని ఈ వింగ్ రాష్ట్రంలోని న్యాయ విద్యార్థుల పక్షాన పోరాటాలు చేస్తుందన్నారు. తన నియామకానికి సహకరించిన ఏఐఎస్ఎఫ్ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి లెనిన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జ్వరంతో వ్యవసాయ కూలీ మృతి

ఓదెల, సెప్టెంబరు 2: మండలంలోని పొత్కపల్లికి చెందిన సిరిసేటి భాగ్యలక్ష్మి (60) అనే వ్యవసాయ కూలీ సోమవారం జ్వరంతో మృతి చెందింది. 15 రోజుల నుంచి జ్వరంతో ఉన్న భాగ్యలక్ష్మి విధిలేని పరిస్థితిలో ఆదివారం కూలిపనికి వెళ్లగా అక్కడ తీవ్ర అస్వస్థకు గురై కుప్ప కూలింది. ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు



గాయపడ్డ బాలుడు

కోనరావుపేట, సెప్టెంబర్ 2 : కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో పిచ్చికుక్క దాడి చేయగా పలువురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బడే ధృవన్, ఓడెల రమ్య, మోకాళ్ల లచ్చిరెడ్డిలు కిరాణా షాపునకు వచ్చి ఇంటికి వెళుతుండగా పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. కాగా లింగంపల్లి రవికి చెందిన లేగ దూడపై పిచ్చికుక్క దాడి చేయగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ముగ్గురిని ఆసుపత్రికి తరలించారు.

మహిళా సంఘాల ధర్నా

● రూ.12.5 లక్షలు స్వాహా చేసిన ఆర్‌పీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



కరీంనగర్‌లో నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 2: మహిళా సంఘాల గ్రూపులకు చెందిన రూ.12.50 లక్షలను ఫోర్జరీ సంతకాలతో స్వాహా చేసిన ఆర్‌పీపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు సోమవారం బల్దియా ఎదుట ధర్నా నిర్వహించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి మాట్లాడుతూ మహిళా సంఘాల గ్రూపు డబ్బులను వాడుకున్న ఆర్‌పీపై చర్యలు తీసుకొని బాధిత మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 11వ డివిజన్ కట్టరాంపూర్‌కు చెందిన గణేశ్ సమైఖ్య ఆధ్వర్యంలో దాదాపు 20 మహిళా స్వశక్తి గ్రూపులు ఉన్నాయన్నారు.

ఈ సమైఖ్యకు గాదం అరుణ ఆర్‌పీగా వ్యవహరిస్తున్నారన్నారు. బ్యాంకులో డబ్బులు వేస్తున్నాని చెప్పి 12 లక్షల 50వేల రూపాయలను స్వంతానికి ఆమె వాడుకున్నారని, గ్రూపు సభ్యులకు తెలియకుండా వారి సంతకాలను ఫోర్జరీ చేశారని ఆరోపించారు. వెంటనే ఆమె నుంచి ఆ డబ్బులను రికవరీ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపి ఆర్‌పీపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ కమిషనర్ సువార్త, మెప్మా పీఆర్‌పి అనిత హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఉపాధ్యక్షురాలు ద్యావ అన్నపూర్ణ, నాయకురాళ్ళు పి.దేవేంద్ర, సమైకర్య అధ్యక్ష, కార్యదర్శులు కుంటా సుప్రజ, చంద్రకళ, పూనా నవ్య, కోశాధికారి తాడెం శ్రీలత, వంగల జ్యోతి, సభ్యులు పాల్గొన్నారు.

వర్షం.. నష్టం

ఉమ్మడి జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు చోట్ల నష్టం వాటిల్లింది. పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహించడంతో రోడ్లు కోతకు గురయ్యాయి. పంటలు నీట మునుగడంతో రైతులు నష్టపోయారు. చెరువుల నిండి కట్టలు తెగిపోయి రోడ్లకు గండ్లు పడ్డాయి.



కథలాపూర్ మండలం ఇప్పపల్లి వద్ద తెగిపోయిన వేములవాడ-కోరుట్ల రహదారి



మెట్‌పల్లి మండలం మాసాయిపేట శివారులో ధ్వంసమైన రహదారి



ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో కోతకు గురైన పొలం



గోదావరిఖనిలో నీటిలో చిక్కుకున్న లారీ



జగిత్యాల రూరల్‌లో అనంతారం బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



పెద్దపల్లిలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

భారీ వాహనంతో ఇక్కట్లు



కరీంనగర్‌లోని మంకమ్మతోట పాత లేబర్ అడ్డా వద్ద సోమవారం రోడ్డుకు అడ్డంగా భారీ కంటెయినర్ ఇరుక్కోవడంతో అరగంట పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించడంతో కంటెయినర్ అక్కడి నుంచి కదిలింది.
-ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఎస్సీ, ఎస్టీ కోర్టు ఇన్‌చార్జి ఏపీపీగా ఆరెల్లి రాములు



కరీంనగర్ లీగల్, సెప్టెంబరు 2: కరీంనగర్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఆరెల్లి రాములు ను నియమిస్తూ తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరెల్లి రాములు ప్రస్తుతం కరీంనగర్ రెండో అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా పనిచేస్తున్నారు. ఈ ప్రత్యేక కోర్టు కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ జరుపుతుంది.

కాస్మోటిక్, బ్యూటీషియన్ సెంటర్లలో తనిఖీలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 2: కాస్మోటిక్, బ్యూటీషియన్ సెంటర్లపై సోమవారం తెలంగాణ వైద్య మండలి(టీజీఎంసీ) వైద్య బృందం, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ సభ్యులు, యాంటి క్వాకరీ బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా టీజీఎంసీ సభ్యుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఎంబీబీఎస్ క్వాలిఫైడ్, డెర్మటాలజీ విభాగంలో స్పెషలిస్టులు మాత్రమే చేయవలసిన థెరపీలు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, లేజర్ థెరపీ లాంటి అలోపతి వైద్యాన్ని నగరంలోని పలు బ్యూటీపార్లర్ నిర్వాహకులు చేస్తున్నారని ఆరోపించారు. డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ పర్మిషన్ లేకుండా, క్వాలిఫైడ్ డాక్టర్ లేకుండా పీఆర్‌పీ అండ్ లేజర్ ట్రీట్‌మెంట్ చేస్తూ క్లినిక్‌లను నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. కేవలం మూడు నెలల శిక్షణ తీసుకొని బ్యూటీషియన్లు డాక్టర్లుగా చెలామణి అవుతున్నారని ఆరోపించారు. ఈ తనిఖీ బృందం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ సభ్యులు డాక్టర్ హరిత, డాక్టర్ రమేశ్, డాక్టర్ చందన, యాంటి క్వాకరీ కమిటి సభ్యుడు డాక్టర్ రితేష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించిన సుడా చైర్మన్



హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 2: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారెంటీల అమలుపై నగర కాంగ్రెస్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను నగర కాంగ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుకు, అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చేరిన పేదలకు సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం పొందడం కోసం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సీఎంఆర్ఎఫ్‌తో పాటు ఆరు గ్యారంటీలకు సంబంధించిన అవగాహన, వివిధ సమస్యల పరిష్కారానికై హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని నరేందర్‌రెడ్డి కోరారు.

రక్తదాన శిబిరం

సుభాష్‌నగర్, సెప్టెంబరు2: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సోమవారం రాష్ట్ర చిరంజీవి యువత అధ్యక్షుడు వేల్పుల వెంకటేష్, పవన్‌కళ్యాణ్ అభిమాని గాలిపెల్లి కుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సాయిధరమ్ తేజ్ ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు కాసరాజు, అభిమాని తాటిపల్లి జనార్దన్, అజయ్ పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్



హుజూరాబాద్‌లో వర్షానికి దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, సెప్టెంబరు 2: గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న వరద బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని 15,17వ వార్డులలో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురికి ఇళ్లలోకి వచ్చిన నీరును చూసి మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను నీరు వెళ్లేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డెయిరీని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

● సర్వే చేపట్టాలని అధికారులకు ఆదేశాలు

గన్నేరువరం, సెప్టెంబరు 2: మండలంలోని గుండ్లపల్లి దగ్గర డెయిరీ నిర్మించిన ప్రదేశాన్ని సోమవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేష్ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువు రికార్డులను, డెయిరీ నిర్మాణ అనుమతులకు సంబంధించిన పూర్తి సర్వేని చేపట్టి నివేదికను అందజేయాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను అడిషనల్ కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని గుండ్లపల్లి దేవుని చెరువు శిఖం భూమిని ఆక్రమించుకొని కరీంనగర్ పాల డెయిరీ నిర్మించారని సీపీఐ నాయకులు, స్థానికులు ఇటీవల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. చెరువు వద్ద కల్వర్టుపై నీటి ప్రవాహానికి రాకపోకలు నిలిచిపోవడానికి పాల కేంద్రమే కారణమని గ్రామస్థులు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో అడిషనల్ కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు నరసింహాచారి, ఇరిగేషన్ ఏఈ రాజ్‌కుమార్, ఆర్ఐ ఫైముద్దీన్, సర్వేయర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబర్ 2: వర్షాల వేళ విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ డివిజనల్ టెక్నికల్ ఇంజనీర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో సోమవారం విద్యుత్తు ఉద్యోగులకు విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, అలాగే రైతులకు విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోరాదని, తడిసిన చేతులతో స్టార్టర్లు కానీ, మోటార్లు కానీ ముట్టుకోరాదన్నారు. విద్యుత్తు లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోరాదన్నారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టరాదన్నారు. కరెంట్ లైన్ కింద సెల్‌ఫోన్ మాట్లాడరాదన్నారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైనా డ్యామేజ్ ఉంటే వెంటనే సంబంధిత అధికారికి సమాచారం ఇవ్వాలన్నారు.

వైఎస్సార్‌కు కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 2: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని నగరంలోని పలుచోట్ల సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమక్షంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలన్నారు.

●జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు అంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో మాతా శిశు హాస్పిటల్లో గర్భిణులకు పండ్లు పంపిణీ చేపట్టారు.

● టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● కాంగ్రెస్‌పార్టీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షులు ఎండీ తాజొద్దీన్ ఆధ్వర్యంలో 54వ డివిజన్ కశ్మీర్‌గడ్డ మదర్సాలో పిల్లలకు అరటిపండ్లు, బిస్కట్ పాకెట్లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, ఏండి తాజ్, కర్ర సత్యప్రసన్నరెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, మడుపు మోహన్, శ్రావణ్ నాయక్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, ఎస్‌కె సిరాజుహుస్సేన్, నేహాల్ అహ్మద్, ఎండీ కలీముద్దీన్, ఫిరోజ్, మతిన్‌ఖాన్, అజీం, ఆరిఫ్‌ఖాన్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

●నగర కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి తాజ్, కొరివి అరుణ్‌కుమార్, శ్రవణ్ నాయక్, సమద్ నవాబ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, దండి రవీందర్ పాల్గొన్నారు.

●హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. డిపో క్రాస్ రోడ్ వద్ద యువజన కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వంగ రామకృష్ణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి సారంగపాణి, పైడిపల్లి అయోధ్య శ్రీనివాస్, మహిపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

●మానకొండూరు: మానకొండూరులో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గసిగంటి సంపత్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వనహాల చారి, ఏఎంసీ డైరెక్టర్ బందెల మహేందర్ పాల్గొన్నారు.

●సైదాపూర్: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, నాయకులు చంద్రారెడ్డి, ఎర్రల శ్రీనివాస్, మండల కొమురయ్య, రాకేష్, యాదగిరి పాల్గొన్నారు.

నేటి నుంచి మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 2: ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ వారియర్స్ టీం ఆధ్వర్యంలో ఈనెల 3. 4 తేదీల్లో మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాంను నిర్వహిసున్నట్లు ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అప్పన్నగారి వెంకట్రావు తెలిపారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ప్రోగ్రాం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సంఘటనలకు కారణం యువతకు జీవితంపై సరైన అవగాహన లేకపోవడమని అన్నారు. నగరంలోని వీ కన్వెన్షన్‌లో నిర్వహించే ఇంపాక్ట్ ప్రోగ్రాంకు హాజరుకావాలని కోరారు. ఉత్తర తెలంగాణ రీజినల్ డైరెక్టర్, మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాం ఇంచార్జి కుతాడి తిరుపతి మాట్లాడుతూ యువత కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 9676004408 నంబరులో సంప్రదించాలని కోరారు. వెంకట్ ఫౌండేషన్ సభ్యులు, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు జాహ్నవి, సుధాకర్, రవీందర్, కవిత, రమేశ్ తదితరులు హాజరయ్యారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 2: వాసవి వాగ్దేవి వనిత క్లబ్ ఇంటర్నేషనల్ ఆర్ రవిచంద్రన్ పర్యటనను పురస్కరించుకొని సోమవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పిల్లలకు స్టేషనరీతోపాటు స్కూలుకు వాటర్ ట్యాంకును అందచేశారు. అలాగే మున్సిపల్‌కార్మికులకు చీరలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా రవిచంద్రన్ మాట్లాడుతూ వాసవీక్లబ్ సేవా కార్యక్రమాల్లో ఎప్పుడు ముందుంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, కార్యదర్శి ఎం స్వరూప, గవర్నర్ జంధ్యం మాధవి, క్యాబినెట్ సెక్రటరీ జంధ్యం మధుకర్, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఆవునూరి శివలీల, రీజియన్ చైర్మెన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పట్టించుకోని నగర పాలక సంస్థ కార్యవర్గం

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 2: సమస్యలను నగర పాలక సంస్థ పాలకవర్గ సభ్యులు గాలికి వదిలేశారని, రోడ్ల పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆరోపించారు. నగరంలోని పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో అసెంబ్లీ ఇంచార్జి కల్యాడపు ఆగయ్య అధ్యక్షతన అసెంబ్లీ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. నగరంలోని రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఈనెల 6న మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన ధర్నా కార్యక్రమాన్ని చేపడతామని కల్యాడపు ఆగయ్య హెచ్చరించారు.

ఎన్‌సీసీ ట్రెక్కింగ్‌లో సెయింట్‌జార్జ్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సెయింట్‌జార్జ్ చైర్మన్ ఫాతిమారెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు2: ఎన్‌సీసీ ట్రెక్కింగ్ సెలక్షన్స్‌లో సెయింట్‌జార్జ్ (సిబిఎస్ఈ) విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెయింట్‌జార్జ్ (సిబిఎస్ఈ) విద్యాసంస్థల చైర్మన్ ఫాతిమారెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసి ట్రెక్కింగ్‌లో పాఠశాల విద్యార్థులుప్రతిభ చాటారన్నారు. సాయి సిద్ధార్థరెడ్డి నవంబర్ మహారాష్ట్రలో జరిగే ట్రెక్కింగ్ క్యాంపునకు ఎంపికయ్యారన్నారు. కిషోర్ గోవాలో డిసెంబర్‌లో జరిగే క్యాంప్‌కి ఎంపికయ్యారన్నారు. శిక్షణ ఇచ్చిన కేర్‌టేకర్ రజితతో పాటు తల్లిదండ్రులను అభినందించారు.

మహిళల రక్షణే షీటీం ప్రధాన లక్ష్యం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 2 : మహిళల రక్షణే షీటీంప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని కరీంనగర్ మహిళా రాణా ఇన్‌స్పెక్టర్, షీటీం ఇన్‌చార్జి పి.శ్రీలత అన్నారు. కరీంనగర్ భగత్‌నగర్‌లోని బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో సోమవారం షీటీం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీలత మాట్లాడుతూ మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వలన గానీ, మరే విధమైన వేధింపుల వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే నిర్భయంగా షీ టీం లేదా కరీంనగర్ మహిళా రాణా పోలీసులను సంప్రదించాలన్నారు. నేరుగా సంప్రదించలేని వారు 8712670759కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు రాష్ట్ర పోలీసుశాఖ ప్రవేశపెట్టిన టీ సేఫ్ యాప్‌ను వినియోగించుకోవాలన్నారు.

సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలి



మాట్లాడుతున్న నర్సింగోజు శ్రీనివాస్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 2: సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి సంక్షేమ హాస్టలకు నూతన భవనాలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు గుంటి స్వరూపా శ్యాం,జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగోని శ్రీనివాస్‌నగర అధ్యక్షులు అనుమాస నితిన్‌బీసీ సంఘం జిల్లా నాయకులు ఎడ్ల ఉమామహేశ్వర, బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్, సెప్టెంబరు 2: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని సీటీ సెంట్రల్ హాల్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ హుజూరాబాద్ డివిజన్‌లో గతంలో కంటే ఈసారి అధికంగా వినాయక మండపాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయన్నారు. గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షాకాలు పడుతున్నందున విద్యుత్ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. గణేష్ ఉత్సవాలు ముగిసే వరకు మండపాల్లో ఒకరూ ఇద్దరూ తప్పని సరిగా ఉండాలన్నారు. గణేష్ నిమజ్జనానికి డిజేలకు అనుమతి లేదన్నారు. సమావేశంలో ఆర్డీవో రమేష్ బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, సీఐలు తిరుమల్‌గౌడ్, పులి వెంకట్‌గౌడ్, కిశోర్, ఒరగంటి రవి, ఎస్ఐ యూసఫ్ అహ్మద్, ట్రాన్స్‌కో ఏఈలు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలని మంత్రి పొన్నంకు వినతి

సైదాపూర్, సెప్టెంబరు 2: సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ మిడ్ మానేరు కెనాల్‌తో ముంపునకు గురవుతుందని, తమ సమస్య పరిష్కరించాలని ఆ కాలనీవాసులు సోమవారం హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విన్నవించారు. వారు పడుతున్న ఇబ్బందులను మంత్రికి తెలియజేయగా సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరించేలా చూస్తానని తెలిపినట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, ఎస్సీ కాలనీవాసులు ఉన్నారు.

ఎమ్మెల్యే చొరవతో నూతన బ్రిడ్జిపై రాకపోకలకు ఏర్పాట్లు



బ్రిడ్జి వద్ద పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం

రామడుగు, సెప్టెంబర్ 2: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో రామడుగు మండల కేంద్రంలో నూతన బ్రిడ్జిపై ఎట్టకేలకు రాకపోకలు కొనసాగాయి. భారీ వర్షాలకు రామడుగు పాత బ్రిడ్జి కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొత్త బ్రిడ్జి పనులు 90 శాతం పూర్తిగా కాగా 10 శాతం మిగిలి ఉన్నాయి. మరోవైపు భూ నిర్వాసితులకు పరిహారం రాక పనులను అడ్డుకున్నారు. రంగంలోకి దిగిన ఎమ్మెల్యే భూ నిర్వాసితులతో మాట్లాడి సమస్య పరిస్కారిస్తానని ఒప్పించారు. జోరువానలో కరీంనగర్ అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ వెంకటలక్ష్మీ, ఎంపీడీవో రాజేశ్వరి, ఎస్ఐ సురేందర్ తదితర అధికారుల సమక్షంలో పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రాకపోకలకు మార్గం సుగమం చేశారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలి



క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, సెప్టెంబరు2: ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో ఎస్సీ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టేందుకు వీలుగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గానికి ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన పది కోట్ల రూపాయలతో ఎస్సీ కాలనీల్లో పనులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడానికి వీలుగా చిత్తశుద్ధితో పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఇంజనీర్లు రవిప్రసాద్, మంజు భార్గవి, నియోజకవర్గంలోని పీఆర్ ఏఈలు సురేందర్‌రెడ్డి, వెంకన్న, మల్లేశం, స్నేహజ్యోతి, సమ్మయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ఎమ్మెల్యే ఆగ్రహం

గన్నేరువరం: గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామంలోని దళితకాలనీలో ఇళ్లలోకి నీరు రాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం కాలనీని సందర్శించారు. కాలనీలోని డ్రైనేజీలలో కూరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గాక కాలనీలో సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. చీమలకుంటపల్లి, తుమ్మనిపల్లె గ్రామాలలో దెబ్బతిన్న రోడ్లను, కల్వర్టును అధికారులతో కలిసి పరిశీలించారు. నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, న్యాలపట్ల కనుకయ్య, తాళ్లపల్లి శ్రీనివాస్, నాగపురి శంకర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

5న పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 2: విద్యార్థులకు,నిరుద్యోగులకు కరీంనగర్ జిల్లా గ్రంథాలయంలో 5 సెప్టెంబర్ 2024 న పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు జిల్లా గ్రంథాలయ పాఠకులు సరిత తెలిపారు. ప్రముఖ విద్యావేత్త విన్నర్స్ పబ్లికేషన్ అధినేత ప్రసన్న హరికృష్ణ హాజరై పోటీ పరీక్షల అభ్యర్థులకు పరీక్షలలో విజయం సాధించుటకు అవసరమైన మెలకువలు తెలియజేస్తారని తెలిపారు. అలాగే గ్రూప్ 1,2, టెట్, డీఎస్సీ, ఎస్సై, పీసీ అభ్యర్థులకు విన్నర్స్ ఆన్ లైన్ ద్వారా ఉచితంగా కోర్సులు, హాజరైనా ప్రతి విద్యార్థికి ఒక కరెంట్ అఫైర్స్ బుక్ ఉచితంగా ఇవ్వనున్నారుఅని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, సెప్టెంబరు 2: నగరంలో మంగళవారం ఉదయం9:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టూ ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. గౌతమినగర్, తిరుమల్‌నగర్, కట్టరాంపూర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 2: కరీంనగర్‌లోని 30వ డివిజన్ మారుతినగర్‌లో వంగల లక్ష్మి, నాగుల దివ్య అనే బాధితులకు మంజూరు అయిన సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు దొంతి గోపి అందజేశారు. కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, కోటేశ్వర్ పాల్గొన్నారు.

కాలువ కబ్జాపై ఫిర్యాదు

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్2: కరీంనగర్ మండలం చేగుర్తి గ్రామంలో పంట కాల్వలకు సంబంధించిన 12ఆర్ కెనాల్ కాలువను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం గ్రామస్తులు ఎల్ఎండీ డిప్యూటి ఇంజనీర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన శంకరయ్య, నరేందర్‌లు 12ఆర్ కెనాల్‌ను ఆక్రమించుకున్నారని తెలిపారు. మామిడితోట పెట్టి పక్కనే ఫెంచింగ్‌ను ఏర్పాటు చేసి కెనాల్ రోడ్డును కబ్జా చేసి ప్రహరీ నిర్మించారని తెలిపారు. ఈరహదారి వెంబడి గ్రామస్థులు నడవకుండా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామస్థులు లక్ష్మీనారాయణ, ఆవుల సంజయ్, డి అంజయ్య, రాజయ్య, చంద్రయ్య, కొమురయ్య, ఆనంద్, రాజు జి శంకర్, శ్రీలేఖ, శ్రీనివాస్, రాజమ్మ తదితరులు ఫిర్యాదు చేశారు.

ఎస్ఆర్ఎం కళాశాలలో వీడ్కోలు సమావేశం

భగత్‌నగర్, సెప్టెంబరు 2: నగరంలోని ఎస్ఆర్ఎం ఎంబీఏ కళాశాలలో సోమవారం విద్యార్థులకు సిగ్నేచర్ డే కార్యక్రమం నిర్వహించారు. కోర్స్ పూర్తయిన సందర్భంగా విద్యార్థులు వారి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్‌రావు, విభాగ ఇన్‌చార్జి డాక్టర్ ఎండి ఖ్వాజామొయినోద్దీన్ పాల్గొన్నారు.

బీమాలో తిరుగులేని ఎల్ఐసీ

భగత్‌నగర్, సెప్టెంబరు2: దేశ ప్రజలకు బీమా రక్షణ కల్పించడంలో 68 సంవత్సరాలుగా తిరుగులేని సంస్థగా ఎదిగిందని ఎల్ఐసీ కరీంనగర్ డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్‌కె శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరంలోని కరీంనగర్ డివిజన్ కార్యాలయంలో 68వ బీమా వారోత్సవాల్లో పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పాలసీదారుల సేవా విభాగం మేనేజర్ సుభాష్‌కుమార్, సేల్స్ మేనేజర్ రాజేష్‌ఖన్నా, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'కులం పేరుతో విద్యార్థులను వేధించడం దారుణం'

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 2: ఇటీవల రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులను కులం పేరుతో దూషిస్తూ ఇబ్బందులకు గురి చేయడం దారుణమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

ఉచిత వృత్తి విద్యా శిక్షణ కేంద్రం ప్రారంభం

గంగాధర: మండలం ఒద్యారం, కాచిరెడ్డిపల్లి గ్రామాల్లో ఉచిత వృత్తి విద్యా శిక్షణ కేంద్రాన్ని ఫాతిమా అడరోషన్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్ ప్రీతా ప్రారంభించారు. శిక్షణలో మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్, బ్యూటీషన్ కోర్సులలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆమె తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

జమ్మికుంట, సెప్టెంబర్ 2: జమ్మికుంట పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 52మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా కోరపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 62మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. డాక్టర్ హిమబిందు, డాక్టర్ మహోన్నత పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేటలో సోమవారం హన్మకొండ లక్ష్మీ నరసింహా ఆసుపత్రి సహకారంతో జనవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్త్రీ ప్రత్యేక వైద్య నిపుణురాలు డాక్టర్ తేజశ్వరి 100 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు.

పారిశుధ్య లోపంతో జ్వరాలు

రామడుగు, సెప్టెంబర్ 2: పారిశుధ్య లోపంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని, జ్వరాల నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ ఆరోపించారు.

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల నిరసన

శంకరపట్నం, సెప్టెంబరు 2: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు శంకరపట్నం మండలంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాదాస్పదమైన ఆర్డర్లను రద్దు చేస్తూ, కాన్ సీక్వెన్షియల్ సీనియారిటీని కొనసాగించాలన్నారు. హుజూరాబాద్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ గుల్లి రవి, భూక్య రమేష్‌నాయక్ ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

చొప్పదండి, సెప్టెంబర్ 2: భారీ వర్షానికి పట్టణంలోని పిట్టల లక్ష్మికి చెందిన పెంకుటిల్లు పాక్షికంగా కూలిపోగా తహసీల్దార్ నవీన్ కుమార్ సోమవారం పరిశీలించారు. విపత్తు అత్యవసర నిధి కింద 3,200 రూపాయల నగదు, 25 కిలోల బియ్యాన్ని బాధితురాలికి అందజేశారు.

గ్రామంలో కనీస సౌకర్యాలు కల్పించాలి

గంగాధర, సెప్టెంబరు 2: గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఒద్యారం గ్రామస్థులు గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైనేజీలు శుభ్రపరచకపోవడంతో దుర్గంధం వస్తోందని, వీధి దీపాలు వెలగడం లేదని పేర్కొన్నారు. మినరల్ వాటర్‌ప్లాంటు మరమ్మతు చేయాలని వినతిపత్రంలో కోరారు. విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని బ్లీచింగ్ చేయించాలని కోరారు.